

సీఎం, డీసీఎం సంతాపం

నటి సరోజాదేవి మృతి పట్ల సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సంతాపం ప్రకటించారు. 'ఎక్స్' ద్వారా సీఎం సిద్దరామయ్య పోస్టులో సరోజాదేవి నటనా చాతుర్యాన్ని కొనియాడారు. అలనాటి మేటి నటి దూరం కావడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు తట్టుకునే శక్తి భగవంతుడు కల్పించాలని ఆకాంక్షించారు. డీసీఎం డీకే శివకుమార్ పోస్టులో సరోజాదేవి అంటే దేశంలోనే పేరొందారన్నారు. ఒకప్పుడు ఆమె సినిమాలు అంటే ఎంతో క్రేజ్ ఉండేదన్నారు. ఆమె మృతి తీరనిలోటు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కన్నడ సంఘాలు సరోజాదేవి చిత్రపటాలకు పూలు చల్లి నివాళి అర్పించారు.



సరోజాదేవి పార్థివదేహం

సత్కారాలు అందుకుంటూ..

- అభినయ సరస్వతికి అశ్రునివాళి
- సరోజాదేవి మృతితో సర్వత్రా విషాదం
- కదిలివచ్చిన కన్నడ నేతలు, తారలు
- సీఎం, డీసీఎం సంతాపం
- నేడు దశవారలో అంత్యక్రియలు

చలించిన చందనసీమ

బెంగళూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల సినిమా రంగంలో దక్షిణాదిన కన్నడ, తెలుగు, తమిళభాషల్లో రాణించి బాలీవుడ్‌లోనూ నటనా చాతుర్యంతో జాతీయస్థాయిలో ఉత్తమ నటిగా కొనసాగిన అభినయ సరస్వతి బీ సరోజాదేవి (87) కన్నుమూశారు. వయోభారం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం దినపత్రికలు చదివి టీవీలో కార్యక్రమాలు చూస్తూనే కుప్పకూలారు. ఆ వెంటనే మల్లేశ్వరంలోని ఇంటికి సమీపంలోని మణిపాల్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అప్పటికే ఆమె తుదిశ్వాస వీడారని వైద్యులు నిర్ధారించారు. చందనసీమలో ఆరు దశాబ్దాలపాటు అగ్రనటిగా కొనసాగి కన్నడలో ప్రముఖ హీరోల చారిత్రాత్మక సినిమాలలో హీరోయిన్‌గా రాణించిన సరోజాదేవి కన్నుమూశారనే విషయం తెలియగానే చందనసీమ మూగబోయినట్లు అయింది. హుటాహుటిన పలువురు నటులు మల్లేశ్వరంలోని సరోజాదేవి నివాసానికి చేరుకున్నారు. నటుడు ఉపేంద్ర, ఆయన భార్య ప్రియాంక, ప్రకాశ్‌రాజ్, సుప్రీత, శ్రీవాణి, మాలశ్రీ, తార అనురాధ, సాధుకోకిల, గురుకిరణ్, జగ్గేశ్, జై జగదీశ్, సా రా గోవిందు, యోగరాజ్‌భట్, బ్రహ్మాండగురూజీలు కడపటి నివాళులు అర్పించారు. మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, వీరప్పమొయిలీ, ఎమ్మెల్సీ శరవణ, ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి, ప్రతిపక్షనేత ఆర్ అశోక్, కుమార బంగారప్ప తదితరులు నివాళులు అర్పించారు. బీ సరోజాదేవి అలనాటి మేటి నటిగా గుర్తింపు పొందారు.

17వ ఏటే సినీరంగంలోకి

ఒకప్పటి మైసూరు సంస్థానం చన్నపట్టణ పరిధిలోని దశవార గ్రామంలో 1938 జనవరి 7న ఒక్కలిగ కుటుంబంలో జన్మించారు. తండ్రి బైరప్ప మైసూరులో పోలీసు అధికారి కాగా తల్లి రుద్రమ్మ గృహిణి. దంపతులకు నాల్గో సంతానంగా సరోజాదేవి జన్మించారు. 17వ యేట కన్నడ సినిమాలో అడుగు పెట్టారు. మహాకవి కాళిదాస 1955లో నటించడం ద్వారా ఆమెకు ఎంతో పేరు వచ్చింది. ఓవైపు కన్నడ సినిమాలలో నటిస్తూనే తెలుగు, తమిళ భాషల్లోనూ కొనసాగారు. కన్నడలో డాక్టర్ రాజ్‌కుమార్, కల్యాణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, తెలుగులో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళంలో జెమినీ గణేశన్, శివాజి గణేశన్, ఎంజీ రామచంద్రన్‌తోపాటు హిందీలో దిలీప్‌కుమార్, రాజేంద్రకుమార్, షమ్మికపూర్, సునిల్ దత్‌లతో కలసి నటించారు. 200 సినిమాలకు గాను 161 సినిమాల్లో హీరోయిన్‌గానే నటించారు. సరోజాదేవి 1967 మార్చి 1న జర్మనీలో మెకానికల్ ఇంజనీర్ అయిన శ్రీహర్షను పెళ్లి చేసుకున్నారు. 1986లో శ్రీహర్ష గుండెపోటుతో కన్నుమూశారు. ఆ తర్వాత కొంతకాలం పాటు కోలుకోలేకపోయారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కాగా పెద్దకుమార్తె మృతి చెందారు.

తల్లిలాంటివారు: శివరాజ్‌కుమార్

సరోజాదేవి తమకు తల్లిలాంటివారని, ఆమె మృతి చెందిన విషయం తెలియగానే మనసు కలచివేసిందని హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. అప్పాజీ రాజ్‌కుమార్‌తో ఎన్నో సినిమాల్లో నటించారన్నారు. మమ్మల్ని బిడ్డలుగా చూసేవారని, ఆ అభిమానం ఎప్పటికీ మరువలేమన్నారు. రాఘవేంద్రరాజ్‌కుమార్ మాట్లాడుతూ తనను చూసిన ప్రతిసారి ఓ బిడ్డలా అభిమానం చూపారని, ఆమెకు నివాళులు అర్పించే పరిస్థితి రావడం బాధ కలుగుతోందన్నారు.

మాజీ సీఎంతో వివాహం కావాల్సి ఉండేది

బీ సరోజాదేవికి మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణతో పెళ్లి జరగాల్సి ఉండేది. ఇద్దరిమధ్యా పెళ్లి ప్రస్తావన వచ్చింది. వేర్వేరు రంగాలు కావడంతో వివాహం చేసుకోలేదు. సరోజాదేవి దూరదృష్టి కల్గినవారు. ఆమె 70 ఎకరాల భూమిని రామనగర జిల్లాలో కొనుగోలు చేశారు. సదాశివనగర్, మల్లేశ్వరంలో నివాసాలు ఉన్నాయి. నెలమంగలతోపాటు పలుచోట్ల ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు అంత్యక్రియలు

బీ సరోజాదేవి అంత్యక్రియలు మంగళవారం చన్నపట్టణ తాలూకా పరిధిలోని దశవార గ్రామంలో నిర్వహిస్తున్నారు. మల్లేశ్వరంలోని రుద్రమ్మ నివాసం నుంచి పార్థివదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని నిర్ణయించారు.



సరోజాదేవి నివాసం వద్ద మాజీ సీఎం వీరప్ప మొయిలీ



బసవరాజ్ బొమ్మై




ప్రియాంక ఉపేంద్ర



తార అనురాధ



రాఘవేంద్ర రాజ్‌కుమార్



శివరాజ్‌కుమార్



రణదీప్‌సింగ్ సుర్జేవాలా



నివాళి అర్పిస్తున్న ప్రతిపక్షనేత అశోక్

24 గంటల్లో పేల్చేస్తాం

- భట్కళ్‌ను నాశనం చేస్తామంటూ బెదిరింపులు
- మెయిల్ చేసిన్ ఖలీద్ అరెస్టు



ఖలీద్



కణ్ణన్ గురుస్వామి

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా ఓడరేవుకు అనుబంధమైన భట్కళ్‌ను 24 గంటల్లో పేల్చివేస్తామని మెయిల్ ద్వారా సందేశం పంపిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈనెల 10న ఉదయం 7.23 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు ఓ మెయిల్ వచ్చిందని ఉత్తర కన్నడ ఎస్పీ ఎం నారాయణ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 40ఏళ్ల నితిన్ అలియాస్ ఖలీద్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మైసూరు సెంట్రల్ జైలులో ఖలీద్ నిందితుడిగా ఉన్నాడన్నారు. ఇతను ఢిల్లీ వాసి కాగా పలు కేసులు ఉన్నాయన్నారు. ఇతను నితిన్ శర్మ అలియాస్ ఖలీద్‌గా కొనసాగుతున్నాడన్నారు. కేరళలో 6, కర్ణాటకలో 3, పుదుచ్చేరిలో 2, ఢిల్లీ మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశ్శా, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కో కేసు ఉందన్నారు. ఏడాదిగా ఇతను జైలులో ఉన్నాడని, తప్పుడు సమాచారంతో బాంబులు పెట్టి పేల్చివేస్తామని బెదరిస్తుంటారన్నారు. తమిళనాడుకు చెందిన కణ్ణన్ గురుస్వామి మొబైల్ ద్వారా మెయిల్ చేసినట్టు గుర్తించామన్నారు. కేరళ మున్నార్ పోలీసులు ఓ మోసం కేసులో కణ్ణన్ గురుస్వామిని విచారణకు తీసుకొచ్చారన్నారు. అదే పోలీస్‌స్టేషన్‌లో ఖలీద్‌ను బాడీ వారెంట్‌పై తీసుకెళ్లారన్నారు. ఇద్దరూ ఒకే బ్యారక్‌లో ఉన్నప్పుడు గురుస్వామి మొబైల్ ద్వారా మెయిల్ చేసి బెదరించారన్నారు. అతడిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య



రచితారెడ్డి



శ్రీజారెడ్డి

మహదేవపుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో తల్లీకుమార్తె ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వైట్‌ఫీల్డ్ నాగొండనహళ్ళి పరిధిలో శ్రీజారెడ్డి (24), తల్లి రచితా రెడ్డి (46) బలవన్మరణానికి పాల్పడ్డారు. డెత్‌నోట్ రాసిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. కుమార్తె శ్రీజారెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో డేటా అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. తొలుత కుమార్తె శ్రీజారెడ్డి తనగదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమార్తె ఉరి వేసుకున్న దృశ్యాన్ని చూసిన తల్లి నేరుగా అల్లుడికి ఫోన్ చేశారు. ఆ తర్వాత తల్లి రచితారెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వైట్‌ఫీల్డ్ పోలీసులు ఘటనా స్థలాన్ని సోమవారం సందర్శించారు. కేసు నమోదు చేసకుని విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల మృతి

బళ్లారి సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి తండ్రీకొడుకు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం విజయనగరం జిల్లా హరపనహళ్ళిలో సాయంత్రం దుగ్గవతి గ్రామంలో పందుల రక్షణ కొరకు తోట కంచెకు కట్టిన విద్యుత్ తీగ తాకడంతో వారు మృతి చెందారు. మృతులను దుగ్గవతికి చెందిన రమేశ్(40),చంద్రప్ప(17) గా గుర్తించారు. ఓ స్తంభం వద్ద లైన్ తెగిపోయి కంచె చుట్టూ చుట్టబడిఉంది. అయితే స్తంభం పైన ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించలేదు. దీంతో కంచెలో విద్యుత్ ప్రవహించింది. అదే మార్గంలోవస్తున్న రమేశ్ విద్యుత్ తీగను తాకాడు. తండ్రిని కాపాడబోయి ఇద్దరూ మృతి చెందారు.



ప్రమాద స్థలం వద్ద పోలీసులు

2 ఏళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం

- ప్రజల ముందే మా విజయాలను వివరిస్తాం
- బీజేపీ నేతలకు సీఎం సిద్దరామయ్య సవాల్

బెంగళూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విజయాలపై బహిరంగ చర్చకు సిద్ధమని బీజేపీకి సీఎం సిద్దరామయ్య సవాల్ విసిరారు. ప్రజల మధ్యన సాక్ష్యాధారాలతో చర్చలు జరుపుదామని అప్పుడు ప్రజలదే తీర్మానం అవుతుందన్నారు. విజయపుర జిల్లా ఇండిలో సోమవారం రూ.4,559 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం బహిరంగసభలో మాట్లాడుతూ తమ పాలనలో ఖజానా ఖాళీ అంటూ బీజేపీ, జేడీఎస్ విమర్శలు చేస్తోందన్నారు. వారు రాజకీయ కారణాలకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను దారి తప్పించాలనేది వారి ఆలోచన అన్నారు. ప్రత్యర్థుల అసత్య ప్రచారానికి ప్రజాసంక్షేమ కార్యక్రమాల ద్వారానే సమాధానం ఇస్తామన్నారు. కరువు జిల్లా విజయపురను పచ్చదనంగా చేసింది కాంగ్రెసే అన్నారు. ఒకప్పుడు కరువుతో నిమ్మ మొక్కలు తొలగించేవారన్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీ, ఇక్కడి పరిస్థితులు తెలుసుకుని నిమ్మ అభివృద్ధి మండలిని ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ లక్ష్యం హామీలు నెరవేర్చడమే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 కోట్లమంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారని, 1.23 కోట్ల కుటుంబాలకు గృహలక్ష్మి అందుతోందని, 1.64కోట్ల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. బీజేపీ, జేడీఎస్ తప్పుడు ప్రచారంతోనే రాజకీయం చేస్తున్నారన్నారు.



విజయపుర జిల్లా ఇండి బహిరంగసభలో సీఎం సిద్దరామయ్య అభివాదం

రూ.3,200 కోట్లతో నీటి ప్రాజెక్టు : డీసీఎం డీకే

విజయపుర జిల్లా పరిధిలో 93వేల హెక్టార్ల భూమిని సాగు పరిధిలోకి తీసుకొచ్చేందుకు రూ.3,200 కోట్లతో ప్రాజెక్టులు రూపొందిస్తామని జలవనరులశాఖ, డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ఎమ్మెల్యేలు పలుమార్లు తమకు ప్రత్యేక గ్రాంట్లు అవసరం లేదని, కానీ ఇక్కడి రైతులకు శాశ్వతమైన నీటి వనరులు కావాలని కోరారన్నారు. అందుకే హోర్తి - రేవణ సిద్దేశ్వర ఎత్తిపోతల పథకం, తిడగుంజి బ్రాంచ్ కెనాల్, ఇండి తాలూకాలో 90 చెరువులకు నీరు మళ్లించే పథకానికి శంకుస్థాపన చేశామన్నారు. వివిధ శాఖల ద్వారా వేల కోట్ల రూపాయల అభివృద్ధికి శంకుస్థాపనలు చేశామన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు ముగిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహదేవప్ప, ఎంబీ పాటిల్, హెచ్‌కే పాటిల్, శివానందపాటిల్, శరణ ప్రకాశ్ పాటిల్, దినేశ్‌గుండూరావు, ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సందడి

- బెంగళూరు తరలిరానున్న కీలక నేతలు
- నేడు ఏఐసీసీ ఓబీసీ సలహా సమితి తొలి భేటీ

బెంగళూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకం అనిపించే కీలక సభలకు కర్ణాటకకు ప్రాధాన్యం ఇస్తోంది. సరిగ్గా ఏడాదిక్రితం లోక్‌సభ ఎన్నికలకు ముందు ఐఎన్‌డీఐఏ కూటమి సభ బెంగళూరులో జరిపారు. రెండు రోజులపాటు వివిధ ప్రాంతీయ పార్టీలతో కలసి దేశవ్యాప్తంగా కూటమికి బలపడేందుకు కీలకసభలు జరిపారు. ఇటీవలే బెళగావిలో మహాత్మాగాంధీ అధ్యక్షతన బెళగావిలో జరిగిన కాంగ్రెస్‌సభకు వందేళ్లు నిండడంతో భారీ సభ జరిగింది. తాజాగా జాతీయ కాంగ్రెస్ పార్టీ (ఏఐసీసీ) ప్రత్యేకంగా ఓబీసీ సలహా కమిటీని ప్రకటించింది. ఇందులో వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ప్రముఖ నేతలను సభ్యులుగా చేర్చింది. 24మంది సభ్యుల్లో కర్ణాటక నుంచి సీఎం సిద్దరామయ్య, బీకే హరిప్రసాద్, మాజీ సీఎం వీరప్పమొయిలీ ఉన్నారు. అదే రీతిన అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాగేల్, వీ నారాయణస్వామి, సచిన్ పైలట్, కమలేశ్వర పాటిల్, గురుదీప్‌సింగ్ సప్పల్, శ్రీకాంత్‌జైనా, అజయ్‌కుమార్ లల్లు, మహేశ్‌కుమార్ గౌడ్, అమిత్ చావడా, అరుణ్‌యాదవ్, పొన్నం ప్రభాకర్, వీ హనుమంతరావ్, జ్యోతిమణి, అదూరు ప్రకాశ్, విజయ్ నామ్దేవరావ్ వెడట్టివర్, ధనేంద్ర సాహూ, సుభాషిణి యాదవ్, హీనా కర్వేలతోపాటు అడ్వైజరీ కౌన్సిల్ కన్వీనర్‌గా డాక్టర్ అరుణ్ జైహింద్, సెక్రటరీ జితేంద్ర బాగేల్‌లు వ్యవహరించనున్నారు. కమిటీ ఏర్పడిన తర్వాత తొలిసారి బెంగళూరులో భేటీ కానున్నారు. మరో 31మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. తెలంగాణ నుంచి మధుగౌడ యాష్కి, అనిల్ యాదవ్, మంత్రులు కొండాసురేఖ; శ్రీహరి వాకిటిలు ఉన్నారు.

రాష్ట్రంనుంచి మంత్రులు మధుబంగారప్ప, సంతోష్‌లాడ్, బోసరాజు, బైరతి సురేశ్, ఏఐసీసీ సెక్రటరీ సూరజ్ ఎంఎన్ హెగ్డే, పీవీ మోహన్‌లు ఉన్నారు. వీరితోపాటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు తమ్రద్వాజ్ సాహూ, జగదీశ్ ఠాకూర్, మాణిక్యం ఠాగూర్, గిరీష్ చోడంకర్, మాణిక్యరావ్ ఠాకరే, కేశవ్ మహతో కమలేశ్, దేవేంద్ర యాదవ్, గౌరవ్ గొగోయ్, జితూ పట్వారీ, ప్రదీప్ యాదవ్, చరణ్‌దాస్ మహంత్, డాక్టర్ అజోయ్ కుమార్ రాయ్, అజయ్‌సింగ్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వరుణ్ చౌదరి, అలి అన్వర్ అన్సారీ, అంబా ప్రసాద్, దేవేంద్ర యాదవ్, చందన్ యాదవ్‌లు పాల్గొననున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, డీసీఎం డీకే శివకుమార్‌లు ఓబీసీ సలహా కమిటీ సమావేశం ఏర్పాట్లపై సమీక్ష చేశారు.


చౌడేశ్వరీదేవికి సిగందూరు కేబుల్ బ్రిడ్జి సమర్పణ

- కర్ణాటకలో రహదారుల అభివృద్ధికి ఐదేళ్లలో రూ.5లక్షల కోట్లు: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

బెంగళూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థ మెరుగు పరిచేందుకు కట్టుబడ్డామని, సిగందూరు కేబుల్ బ్రిడ్జ్‌ను చౌడేశ్వరి దేవికి సమర్పిస్తున్నామని, ఇక భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మ దర్శనం చేసుకోవచ్చని కేంద్ర భూ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి అన్నారు. రూ.473 కోట్ల రూపాయలతో 2.12 కిలోమీటర్ల మేర లింగనమక్కి బ్యాక్‌వాటర్‌లో నిర్మించిన కేబుల్ బ్రిడ్జ్‌ను సోమవారం ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా సాగరలోని నెహ్రూ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గడ్కరి మాట్లాడుతూ ఇదో చారిత్రాత్మకమైన బ్రిడ్జ్ అని, కొన్నేళ్లకాలంగా భక్తులకు చౌడేశ్వరిదేవి దర్శనం సమస్యగా ఉండదేన్నారు. బ్రిడ్జ్ నిర్మాణంతో ఈ ప్రాంతానికే కొత్త కళ వచ్చిందని కితాబునిచ్చారు. కర్ణాటక రాష్ట్ర వికాసానికి రానున్న ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్ల పనులు చేపడ్తామని ప్రకటించారు. బెళగావి - హుణగుంద - రాయచూరు మధ్య 4లైన్ల రహదారిని 10వేల కోట్లతో నిర్మిస్తామన్నారు. ఢిల్లీ - బెంగళూరు మధ్య ప్రత్యేక రహదారి అవసరమన్నారు. బెంగళూర - ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయ్యిందన్నారు. బెంగళూరులో 15వేల కోట్ల రూపాయలతో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 45శాతం పనులు పూర్తయ్యాయన్నారు. బెంగళూరు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. బెంగళూరు - మైసూరు రోడ్డు శాశ్వత పద్ధతిన నిర్మిస్తామని, శివమొగ్గ - మంగళూరు మధ్య నాలుగు లేన్‌ల రహదారికి డీపీఆర్ ఆహ్వానించామన్నారు. ఇదే వేదికపైనుంచే 2వేల కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ 'ఏ మ్యాన్ ఆఫ్ నేషనల్ హైవేస్' అనేపేరు గడ్కరికి సరిపోతుందన్నారు. 2047 నాటికి వికసిత భారత్‌లో భాగంగా దేశంలో మరెన్నో మార్పులు రానున్నాయన్నారు. సాధారణంగా నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తే మరెప్పుడో ప్రారంభాలు ఉంటాయని, కానీ వేలాది ప్రాజెక్టులకు గడ్కరి శంకుస్థాపన చేసి ఆయనే ప్రారంభిస్తున్నారని కొనియాడారు.



చౌడేశ్వరీ దేవి పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



కేబుల్ బ్రిడ్జ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రులు గడ్కరి, ప్రహ్లాద్‌జోషి

కల నెరవేరింది: యడియూరప్ప

మాజీ సీఎం యడియూరప్ప మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూసిన కల ఇన్నాళ్లకు నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికే ఓ సంకేతమన్నారు. శివమొగ్గ ఎంపీ రాఘవేంద్ర మాట్లాడుతూ 60 ఏళ్ల కలను ఆరేళ్లలో పూర్తి చేసిన ఘనత నితిన్‌గడ్కరి, యడియూరప్పలకే దక్కుతుందన్నారు. శరావతి నదికి మకుటం లాంటి మలెనాడు సొగసుకు కేబుల్ కేబుల్ బ్రిడ్జి సరికొత్త ఆవిష్కరణగా మారిందన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఏడుగురి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల, జూలై14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందుల గ్రామంలో ఈనెల 3న జరిగిన ఖైలే శంకరయ్య హత్య కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్, సీఐ కౌలుట్లయ్యతో కలిసి డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. ఈనెల 3వ తేదీన ఖైలే శంకరయ్య మనవరాలు శ్యామల ఇంటి వెనుక ఉన్న దారికి ముళ్లకంపలు అడ్డంగా వేసింది. ఈ విషయమై పక్కనే నివాసం ఉంటున్న దాసరి ప్రభాకర్ భార్య సరస్వతి, తల్లి రత్నమ్మ అదే రోజు మధ్యాహ్నం శ్యామలతో గొడవపడ్డారు. సాయంత్రం ఇంటికొచ్చిన ప్రభాకర్‌కు విషయం చెప్పారు. దీంతో ప్రభాకర్, అతడి తమ్ముడు త్రినాథ్, బంధువులు రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు, సరస్వతి, రత్నమ్మ కలిసి కట్టెలు, రాళ్లు తీసుకుని శ్యామల భర్త మల్లికార్జునను వెతుక్కుంటూ శంకరయ్య ఇంటి వద్దకెళ్లారు. 'మల్లికార్జున ఎక్కడ?' అంటూ నానా దుర్భాషలాడారు. కొన్ని రోజుల్లో పీర్ల పండుగ ఉందనీ, ఈ సమయంలో గొడవలు వద్దనీ, సమస్య ఉంటే తరువాత మాట్లాడుకుందామని శంకరయ్య సర్దిచెప్పినా వినలేదు. ఆగ్రహంతో ఉన్న ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు కలిసి శంకరయ్య, అతడి బంధువులు బాలగంగిరెడ్డి, నాగేంద్ర, అమ్ములన్న, పెద్దరాజుపై కట్టెలతో దాడి చేశారు. శంకరయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా దాసరి ప్రభాకర్, త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులును మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

విద్యుదాఘాతానికి కౌలు రైతు బలి



పెద్దారెడ్డి (ఫైల్)

యల్లనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామా నికి చెందిన బసిరెడ్డి పెద్దారెడ్డి (49) విద్యుదాఘాతంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దారెడ్డి లక్షుంపల్లి గ్రామ సమీపంలో 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంటకు నీరు పెట్టడానికి రాత్రి 10గంటల సమయంలో ఇంటి నుంచి తోటకు వెళ్లాడు. అక్కడ మోటారు ఆన్ చేయడానికి స్టార్టర్‌లోకి వెళ్లే వైర్లు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటి తర్వాత పొలం వద్దకు వెళ్లిన పెద్ద కుమారుడికి తండ్రి కనిపించలేదు. దీంతో పొలం అంతా వెదికాడు. చివరకు స్టార్టర్ పెట్టె వద్ద విగతాజీవిగా పడి ఉన్న తండ్రి కనిపించడంతో బోరుమంటూ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమారులు సాయిప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి ఉన్నారు. కుమారుడు సాయిప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా

- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు

గుత్తి, జూలై14(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్ రోడ్డులో సోమవారం ఆటో బోల్తా పడి ఎరుకలప్ప(65) అనే వ్యక్తి మృతిచెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. కర్ణాటకలోని హోస్పేటకు చెందిన ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప సొంతూరి నుంచి రైలులో గుత్తి ఆర్ఎస్‌కు వచ్చారు. వారు పెద్దవడుగూరుకు వెళ్లాల్సి ఉంది. ఆర్ఎస్ నుంచి గుత్తికి వచ్చేందుకు ఆటో ఎక్కారు. అదే ఆటోలో గుత్తికి చెందిన విజయలక్ష్మి, గుత్తి ఆర్ఎస్‌కు చెం దిన రాజు కూడా ఎక్కారు. కేంద్రీయ విద్యాలయం సమీపాన కుక్క అ డ్డువచ్చింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపుతప్పి బోల్తా ప డింది. ప్రమాదంలో ఎరుకలప్ప, వీరభద్రప్ప, తిమ్మప్ప, విజయలక్ష్మి, రాజు గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎరుకలప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఏర్పాట్ల కోసం వెళితే చోరీ

- కారులో ఉంచిన రూ.ఏడు లక్షల అపహరణ



అనుమానితులు

గోరంట్ల, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పట్టపగలే కారులోని రూ.ఏడు లక్షలు గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన స్థానిక శ్రీవాసవీ మహల్ వద్ద సోమవారం జరిగింది. మండలంలోని మల్లాపల్లి బీపీఎం (బ్రాంచ్ పోస్టుమాస్టర్)రామచంద్రరావు కుమారుడి పెళ్లి నవంబరులో చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లలో భాగంగా బంగారం కోసం అడ్వాన్సు ఇవ్వడానికి రామచంద్రరావు అతడి సోదరుడు రిటైర్డ్ వీఆర్‌ఓ వసంతరావు, కుమారుడు నాగతేజ ముగ్గురు కారులో గోరంట్లకు వచ్చారు. ఉదయం 11.30గంటల సమయంలో స్టేట్‌బ్యాంక్‌లో రూ.ఏడు లక్షల డ్రా చేసి కారులోనే బంగారం దుకాణానికి వెళ్లారు. షాపు యజమాని లేకపోవడంతో నేరుగా వాసవీమహల్‌వద్దకు వెళ్లి రహదారి పక్కన కారు ఆపారు. నగదు మొత్తాన్ని కారులో ఉంచి, అద్దాలు లాక్ చేసి, కల్యాణమండపాన్ని పరిశీలించడానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కారు ముందు ఎడమవైపు ఉన్న అద్దం పగలకొట్టి డబ్బు చోరీ చేసినట్లు బాధితులు చెప్పారు. సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు పల్సర్ వాహనాల్లో నలుగురు వ్యక్తులు బ్యాంక్ వద్ద నుంచి కారును వెంబడించినట్లు బాధితులు తెలిపారు. పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిబ్బందిని అప్రమత్తం చేసి, సీసీపుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఎంపీపీ ఉప ఎన్నికపై సమీక్ష

రామగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నికపై మండల అధికారులు సోమవారం సమీక్షించారు. ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప, ఎస్ఐ సుధాకర్ యాదవ్, ఎంపీడీఓ గంగావతి, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ సమావేశమయ్యారు. ఈనెల 16న ఎన్నిక సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఎన్నికల అధికారి సంజీవయ్యతో సీఐ రెడ్డప్ప ఫోన్‌లో మాట్లాడి ఎన్నికకు సంబంధించి సమాచారం తెలుసుకున్నారు. ఎన్నిక నిర్వహించే గదిలో సీసీ కెమెరాలు, సీట్ల ఏర్పాటు తదితర వివరాలు తెలుసుకున్నారు. కోరంలేక ఎంపీపీ ఉప ఎన్నిక ఇదివరకే రెండుసార్లు వాయిదా పడింది. ఈసారి సభ్యులందరికీ నోటీసులు నో టీసులు అందించామని అధికారులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా రు. ఎంపీపీ ఎన్నికకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురంవిద్య జూలై 14(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలలో మిగులి ఉన్న టెన్త్, ఇంటర్ సీట్లకు ఈనెల 16న స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు జిల్లా సమన్వయ అధికారి జయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆర్ట్స్‌గ్రూపులోమాత్రమే సీట్లు ఉన్నాయన్నారు. నల్లమాడలో సీఈసీ, ఉరవకొండలో ఎంఈసీ, సీఈసీ, బ్రహ్మసముద్రంలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. పదోతరగతిలో ఉరవకొండ, హిందూపురం, అమరాపురం, మలగూరులో పరిమిత ఖాళీలు ఉన్నాయన్నారు.

పెళ్లి కాలేదని నమ్మించి..!

- విడాకులు పొందిన మహిళతో రెండో పెళ్లి
- డబ్బు, బంగారం కాజేసి.. ప్లేటు ఫిరాయింపు
- పోలీసులను ఆశ్రయించిన గర్భిణి



పోలీసుస్టేషన్ వద్ద బాధితురాలు, కుటుంబ సభ్యులు, నాయకులు

గుంతకల్లు టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెళ్లి కాలేదని నమ్మించి, తనను వివాహం చేసుకుని మోసగించాడని గుంతకల్లు పట్టణానికి చెందిన వీఆర్వో మహ్మద్ అలీపై షేక్ షమీమ్ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులతో కలిసి బాధితురాలు న్యాయం కోసం గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు ఆశ్రయించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు, గుంతకల్లు భాగ్యనగర్‌కు చెందిన పీరాన్ కూతురు షేక్ షమీమ్ బానుకు 2017లో రాయచూర్‌కు చెందిన షామీర్‌తో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు అబ్బాస్ అలీ ఉన్నాడు. దంపతుల మధ్య విభేదాల కారణంగా 2023లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి షమీమ్ తనక కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. రేషన్ కార్డులో తన కుమారుడి పేరు చేర్చాలని గుంతకల్లు మున్సిపాలిటీలోని 24వ సచివాలయంలో ఆమె సుమారు ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేశారు. అక్కడ వీఆర్వో మహమ్మద్ అలీ పరిచయమయ్యాడు. అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని, రెండు రోజుల తరువాత రమ్మని సూచించాడు. ఈ క్రమంలో ఆమె గత జీవితం గురించి తెలుసుకుని పరిచయం పెంచుకున్నాడు. 'నీకూ మంచి రోజులు వస్తాయి.. బాధపడకు' అని ఓదార్చాడు. ఇంటి స్థలం, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష తీసుకున్నాడు. ఆ తరువాత మాయ మాటలు చెప్పి, గత ఏడాది మే 22న అనంతపురానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం షమీమ్ ఏడు నెలల గర్భిణి. ఈ విషయం తెలుసుకున్న మహమ్మద్ అలీ మొదటి భార్య నూర్జహాన్, ఆమె కుటుంబ సభ్యులు నెల క్రితం షమీమ్ వద్దకు వచ్చి గొడవపడ్డారు. ఆమెను దూషించి, దాడి చేసి వెళ్లారు. దీంతో మహమ్మద్ అలీకి ఇది వరకే వివాహం జరిగిన విషయం షమీమ్‌కు తెలిసింది. ఈ విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ సమయంలో తన భర్త మహమ్మద్ అలీ, ఆయన మొదటి భార్య, ఆమె అన్నలు, వదినలు తనను అసభ్య పదజాలంతో దూషించారని, తన తండ్రిని చంపేస్తామని బెదిరించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మహమ్మద్ అలి తన బంగారాన్ని యాంకర్ వెల్ఫేర్ బెంగళూరు బ్రాంచిలో తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడని వాపోయారు. ఆ డబ్బులను రెండింతలు చేస్తానని నమ్మించి మోసగించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, అతని మొదటి భార్య ఆమె అన్నలు, వదినలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరకాస్తు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకునన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. మార్గదర్శకాలకు సంబంధించిన వివరాలు డీఈఓ బ్లాగ్‌లో ఉంచామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తర్వాత ఉన్నతాధికారి ధ్రువీకరణతో ఈనెల 16వతేదీ సాయంత్రంలోపు చేసిన ఆ దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీఈఓ కోరారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ రకం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1275 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు వివరించారు.

20న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగాల్లో సెలెక్షన్స్ ఉంటాయని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులు తెలిపారు. 2010 జనవరి 2వతేదీ తరువాత జన్మించిన వారు సబ్‌జూనియర్, 2006 జనవరి 2 తరువాత జన్మించిన వారు జూనియర్ విభాగానికి అర్హులన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9966188133 నంబరులో సంప్రదించాలని కోరారు.

గూడ్స్‌రైలు ఢీకొని రైతు మృతి

చెన్నేకొత్తపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలకుంట సమీపాన ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని రైతు రామాంజనేయులు (43) మరణించాడు. హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సి.ఆమిదాల కుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు తోట వద్దకెళ్లాడు. పనిముగించుకుని తిరిగి ఇంటికి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం రైల్వే పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ద్వారా మృతదేహాన్ని గుర్తించిన తరువాత పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రామాంజనేయులుకు భార్య శమంతకమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

ధర్మవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణం వద్ద ప్రమాదవశాత్తు ఓ బాలిక విద్యుదాఘాతంతో సోమవారం తీవ్రంగా గాయపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ....ఒంగోలు నుంచి హరి, రాధిక దంపతులు మూడు నెలల కిందట కూలి పనుల కోసం వలస వచ్చారు. ఈక్రమంలో శారదానగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి కూలి పనులకు తమ కుమార్తె వెంకటేశ్వరితో కలిసి వెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమవ్వగా, వెంకటేశ్వరి అక్కడే ఆడుకోవడం ప్రారంభించింది. ఈక్రమంలో అక్కడ ఇనుపరాడ్లకు కరెంటు సరఫరా అవుతుండటాన్ని గమనించని బాలిక దాన్ని తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదరగొట్టిన అనంత బౌలర్లు

- నెల్లూరు 237 ఆలౌట్
- నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు ప్రారంభం



వినయ్‌కుమార్



జై కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనంత బౌలర్ల ధాటికి నెల్లూరు బ్యాటర్లు చేతులెత్తేశారు. వినయ్‌కుమార్, జైకృష్ణ చెరో నాలుగు వికెట్లు పడగొట్టడంతో నెల్లూరు కోలుకోలేకపోయింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. ధృవ్‌తేజ (62), రోషన్ పవన్‌కుమార్ (55) హాఫ్ సెంచరీలు చేశారు. అనంతపురం బౌలర్లు వినయ్‌కుమార్, జైకృష్ణ చెలరేగిపోయారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆటముగిసే సమయానికి 23 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. చైత్రవర్ధన్ (55), రోహిత్‌రోషన్ (29) రాణించారు. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్ల మధ్య పోటీ సాగుతోంది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. తౌఫీక్ హుస్సేన్ (49), మురళి (40), ఇస్మాయిల్ (44), అంజనేయులు (31) ఫర్వాలేదనిపించారు. కడప బౌలర్లు పఠాన్‌షరీఫ్ 4, అరీఫ్‌బాషా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 23 ఓవర్లలో వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. వంశీకృష్ణ అజేయ హాఫ్ సెంచరీ (77)తో కొనసాగుతున్నాడు.

రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలే 'అనంత'లక్ష్మి లక్ష్యం

- ప్రతి సంవత్సరం 400కుపైగా ప్లేస్‌మెంట్స్
- 4 గదులు, 240 మంది విద్యార్థులతో ప్రారంభం
- నేడు 8 బ్రాంచ్‌లు, 1380 బీటెక్ ఇంజనీరింగ్ సీట్లు
- అటానమస్ కళాశాల నుంచి వర్సిటీవైపు అడుగులు
- అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అంతరాముడు



అనంతపురం వైద్యం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యవసాయ కుటుంబంనుంచి వచ్చిన అనంతరాముడు 1972లో బీఏ డిగ్రీ పూర్తిచేసి బ్యాంక్ ఉద్యోగానికి హైదరాబాద్ బయలుదేరాడు. అప్పటికే తాత, తండ్రికి వ్యవసాయంలో తోడుగావుంటూ పంటల దిగుబడిని మద్రాసు మార్కెట్‌లో అమ్మివచ్చేవాడు. సొంతూరితోపాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు మనమే వ్యవసాయకూలీ పనిని కల్పిస్తున్నాం, పదిమందిని జీతం పెట్టుకున్నాం. మనం ఇంకొకరివద్దకు జీతం వెళ్లడమేంటని వారు అడ్డుకున్నారు. జీతానికి వెళ్లడంకాదు జీతాలు ఇచ్చేస్థాయికి మనం ఎదగాలన్న కుటుంబ పెద్దల సూచన అనంతరాముడి ఆలోచన మార్చివేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయంలోని లోపాలను గుర్తించి అధునాత పద్ధతిలో పంటలు పండించేస్థాయికి చేరుకున్నాడు. అన్నదానం కంటే విద్యాదానం గొప్పదని భావించిన అనంతరాముడు.. విద్యారంగంవైపు ప్రయాణించారు. ఎస్కేయూ దగ్గర ఇటుకలపల్లి సమీపంలోని బైప్ రోడ్డు పక్కన అనంతలక్ష్మి విద్యాసంస్థల పేరుతో 2008లో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేశారు. నాలుగు గదులు, 240మందితో బీటెక్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించి నేడు 8 బ్రాంచ్(కోర్సు)లు, 1380సీట్లతో అటానమస్(స్వయం ప్రతిపత్తి) కళాశాలగా తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం 400మందికిపైగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తూ వారిని సొంతకాళ్లపై నిలబెడుతున్నారు. కళాశాలలో మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అధునాతన ల్యాబ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో జాతీయ సంస్థలైన న్యాక్, ఎన్‌బీఏ, ఐఎస్ఓ అక్రిడిటేషన్ గుర్తింపునిచ్చాయి. అటానమస్ కళాశాలనుంచి వర్సిటీవైపు అడుగులు వేస్తున్న కళాశాలలో బీటెక్ ఇంజనీరింగ్‌తో విద్యార్థుల బవిష్యత్‌పై 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను అనంతరాముడు పంచుకున్నారు.

ప్ర: విద్యార్థులకు ఉద్యోగాలే లక్ష్యంగా ఏం చేస్తున్నారు?

జ: తల్లిదండ్రులు వారి పిల్లలు ప్రయోజకులుగా కావాలని మా కళాశాలలో చేర్పిస్తున్నారు. వారికి పాఠాలునేర్పి పాస్‌కాగానే సర్టిఫికెట్స్‌ను అందజేసి పంపితే వారి ఆశలు నెరవేరవు. ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్‌ను డెవలప్‌చేసి కళాశాలలోనే క్యాంపస్ సెలెక్షన్స్ చేపడుతున్నాం.

ప్ర: ఎంతమందికి ఉద్యోగాలొస్తున్నాయి?

జ: ప్రతి విద్యార్థికి ఉద్యోగం వస్తుంది. ప్రతి సంవత్సరం 400మందికిపైగా ఉద్యోగాలకు వెళ్తున్నారు. మిగిలినవారు ఇంకా పైచదువులకు వెళ్తున్నారు. రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వార్షిక వేతనం(ప్యాకేజ్)తో ఎంపికవుతున్నారు. భవిష్యత్తులో రూ.20లక్షల ప్యాకేజ్‌తో ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు అమలుచేశాం.

ప్ర: కళాశాలలో ఏయే బ్రాంచ్‌లు ఉన్నాయి?

జ: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో డేటా సైన్స్(సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(సీఏఐ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్(ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్(సీఐవీ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈసీ) మొత్తం ఎనిమిది బ్రాంచ్‌లున్నాయి.

ప్ర: బ్రాంచ్‌కు ఎన్ని సీట్లున్నాయి, ఫీజు ఎంత?

జ: సీఎస్ఈ 540, సీఎస్‌డీ 60, సీఎస్ఎం 300, సీఏఐ 60, ఈసీఈ 300, ఈఈఈ 60, సీవీ 30, ఎంఈసీ 30 మొత్తం 1380 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద చేరే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌ను చెల్లిస్తుంది.

ప్ర: కౌన్సెలింగ్‌లో కళాశాలను ఎలాఎంచుకోవాలి?

జ: ఏపీఈఏసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇప్పటికే కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. ఇక కళాశాల, బ్రాంచ్ ఎంపికలు మొదలుపెట్టారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల కోడ్ 'ALTS' ను ఎంపిక చేసుకుని, వారికి నచ్చిన బ్రాంచ్‌కు టిక్ పెట్టాలి. మొదటి ప్రాధానత్యగా 'ALTSకు ఆప్షన్ ఇచ్చుకుంటే సీట్ అలాట్మెంట్ అవుతుంది.

ప్ర: పాఠ్యాంశాల రూపకల్పన?

జ: అకడమిక్ సిలబస్‌ను జేఎన్టీయూ రూపొందిస్తుంది. అయితే వాటిలో మార్పుచేసుకునే అవకాశం అటానమస్ అయిన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలకుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను ఫ్రేమ్‌చేస్తున్నాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందే అంశాలు. సొంతంగా పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన అంశాలతో కూడిన పాఠాంశ్యాలను రూపొందిస్తున్నాం.

హెచ్చెల్సీకి నవంబరు వరకు నీరు

- సరిహద్దులో కాలువను పరిశీలించిన ఎస్ఈఈ



సరిహద్దులో కాలువను పరిశీలిస్తున్న డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్

బొమ్మనహాళ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలను నవంబరు ఆఖరి వరకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తుంగభద్ర డ్యాం ఎస్ఈఈ నారాయణనాయక్, ఎస్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బొమ్మనహాళ్ సరిహద్దు వరకు హెచ్చెల్సీని సోమవారం వారు పరిశీలించారు. తుంగభద్ర జలాలను ఈ నెల 10న విడుదల చేసిన నేపథ్యంలో కాలువ స్థితిపై పరిశీలించినట్లు వారు తెలిపారు. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. ఆంధ్ర వాటా 18 టీఎంసీలు నీరు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాం నుంచి 1400 క్యూసెక్కులు వదలగా సరిహద్దు 105 కిలోమీటర్ వద్ద 500 క్యూసెక్కులు నీరు వస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర ఎగువ కాలువలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిని తీసుకోవడంలో మరి కొద్ది రోజులు ఆలస్యం కావచ్చని వారు తెలిపారు.

విషపు గుళికల ఘాటుతో విద్యార్థిని మృతి



శివప్రియ(ఫైల్)

తాడిపత్రి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విషపు గుళికల ఘాటు తగిలి మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని శివప్రియ (14) మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకుం బందార్లపల్లికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె శివప్రియ బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. రోజూ ఇంటి నుంచి బడికి వెళ్లి వచ్చేది. ఈక్రమంలో సోమవారం ఉదయాన్నే పూజ చేసి స్కూలుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇల్లు శుద్ధి చేయడానికి పూనుకుంది. పురుగు పట్టకుండా ఉండటానికి విషపు గుళికలు కలిపి దాదాపు 50 బస్తాల వేగశనగకాయలు ఇంట్లోనే ఒక గదిలో నిల్వ ఉంచారు. అయితే ఏమరుపాటుతో శివప్రియ ఆ గది తలుపు తెరిచింది. ఒక్కసారిగా గుళికల ఘాటు బాలిక ముక్కును తాకింది. దీంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తల్లిదండ్రులు గమనించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా, చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

11 సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(సొసైటీ)లకు త్రిసభ్య కమిటీల పాలకవర్గాలను నియమిస్తూ సోమవారం రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీల పదవీకాలం నెలాఖరు వరకు ఉంటుంది.

త్రిసభ్య కమిటీల వివరాలు..

సొసైటీ	చైర్మన్	సభ్యులు
మామడూరు	సురేష్	కర్ణ, రామకొండయ్య
తొండపాడు	శివశంకర	రమణ, సుంకన్న
గుంతకల్లు	మస్తానప్ప	సుబ్బయ్య, శివశంకర్ రెడ్డి
పి కొత్తపల్లి	శ్రీనివాసరెడ్డి	పద్మావతి, ఖాదర్‌బాషా
గార్లదిన్నె	విశ్వనాథనాయుడు	ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి
ఎర్రగుంటపల్లి	జయరామిరెడ్డి	బ్రహ్మయ్య, విశ్వనాథ్
యాడికి	చలమారెడ్డి	ఓబులేసు, మనోహరచౌదరి
చాపిరి	నారాయణ	శ్రీరాములు, నాగన్న
గొల్లపల్లి	గురుమూర్తి	దాదాపీర్, కవితమ్మ
డి కొండాపురం	వీరభద్ర	రామాంజనేయులు, గంగాధరశెట్టి

వీకే పార్వతమ్మ మృతి తీరనిలోటు: సీపీఎం



వీకే పార్వతమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ మృతి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. వీకే పార్వతమ్మ (101) ఆదివారం మొదటిరోడ్డులోని తన నివాసంలో వయోభారంతో తుదిశ్వాస విడిచారు. సోమవారం వామపక్ష, అనుబంధ సంఘాల నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం గుత్తిరోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ తదితరులు వీకే పార్వతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... వీకే పార్వతమ్మ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. మహిళా ఉద్యమ పోరాటాల్లో ఆమె కృషి మరువలేనిదన్నారు. అనేకమంది కమ్యూనిస్టు కార్యకర్తలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. భర్తకు తోడుగా ఉంటూనే కార్యకర్తలు, నాయకులను కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామిరెడ్డి, ఐద్వా నేత చంద్రిక పాల్గొన్నారు.

అదే గందరగోళం..!

- ఎంఎస్‌కేలకు అందని బదిలీ ఉత్తర్వులు

అనంతపురం క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. 15 రోజులైనా చాలా మందికి బదిలీలపై క్లారిటీ ఇవ్వడం లేదు. పీజీఆర్ఎస్‌లో గ్రీవెన్స్ ఇవ్వడానికి కూడా బాధితులకు సోమవారం లోపలికి అనుమతించలేదు. సుమారు 30 మంది వరకూ డీపీఓ బయటే పడిగాపులు కాసి వెనుతిరిగారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు అశాస్త్రీయ, అనాలోచిత నిర్ణయాల వల్ల వందలాది మంది బదిలీలలో గందరగోళం ఏర్పడింది. దీంతో మళ్లీ మూడు రోజుల తర్వాత మరోసారి అర్ధరాత్రి వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా మంది తాము కోరుకున్న స్థానాలను కాదని, అధికారులకు నచ్చినవి ఇచ్చారని పలువురు కన్నీళ్లు పెట్టుకుని వెనుతిరిగారు. ఇంత జరిగినా సమస్యను పరిష్కరించలేదు. 15 రోజులుగా నాన్చుతూనే ఉన్నారు. పైరవీలు, పొలిటికల్ సిఫార్సుల కారణంగా అర్హులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు.

అర్హులకు న్యాయం

గత నెల 30న జరిగిన కౌన్సెలింగ్‌లో సీనియారిటీ జాబితాలో ముందున్న ఎంఎస్‌కేలు క్లియర్ వేకెన్సీలకు ఆప్షన్లు ఇచ్చి వె ళ్లారు. ఆ తర్వాత ఇచ్చిన ఆర్డర్లు చూస్తే రేషనలైజేషన్‌లో ఎఫెక్ట్ (నో పోస్టు) అయిన స్థానాలను ఇచ్చారు. చాలా మంది అర్హులకు రేషనలైజేషన్‌లో ప్రభావితమై.. మిగిలిన పోస్టులను కేటాయించారు. ఈ సమస్య పరిష్కారం కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. డీపీఓలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో విన్నవించుకుందామని వెళితే లోపలికి వెళ్లనీకుండా అడ్డుకున్నారు.


కొందరికి ఆర్డర్లు ఇవ్వలేదు

ఎంఎస్‌కేల బదిలీ ఉత్తర్వులు కొన్ని మండలాలకు డీపీఓ నుంచి పంపారు. కొందరికి ఇప్పటి వరకూ ఉత్తర్వులు ఇవ్వలేదు. అనంతపురం నగరంలోని చాలా మంది మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఉత్తర్వు కాపీలు ఇవ్వలేదు. దీంతో ఇప్పటి వరకూ జరిగిన రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో తాము ఇచ్చిన ఆప్షన్ల మేరకు బదిలీలు చేస్తారా..? లేక మరో చోటుకు బదిలీ చేస్తారా..? అని వారు టెన్షన్ పడుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

కె. కామరాజ్ (జయంతి)



భారతీయ రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా పేరొందిన కుమారస్వామి కామరాజ్ నాడార్ 1903 జూలై 15 తమిళనాడు రాష్ట్రం విరుదునగర్‌లో జన్మించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించి ఇందిరాగాంధీని ప్రధానమంత్రి చేయడంలో కీలకపాత్ర పోషించారు. కల్లుగీత కుటుంబంలో జన్మించిన ఆయన ప్రజాసంక్షేమం కోసం పోరాటాలు చేస్తూ పెళ్లి కూడా చేసుకోలేదు. నారాయణ గురు ప్రభావం ఆయనపై ఉండేది. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా ఉన్నతహోదాలు అలంకరించారు. పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాదిమందికి విద్యకు చేరువ చేశారు. 1975 అక్టోబరు 2న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో జన్మించారు. రచయిత్రిగా, న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగాను సమాజంకోసం ఎంతో పాటుపడ్డారు. చెన్నై, హైదరాబాద్‌లలో ఉన్న ఆంధ్ర మహిళా సభలను ఈవిడే స్థాపించారు. ప్రణాళికా సంఘం సభ్యురాలిగా ఉన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్‌కు తొలి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. 1975లో పద్మవిభూషణ్ పురస్కారం అందుకోగా అదే సంవత్సరం ఆమె భర్త సీడీ దేశ్‌ముఖ్ కూడా పద్మవిభూషణ్ పొందడం విశేషం. వయోజన విద్యాసేవలకు నెహ్రూ లిటరసీ అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1981 మే 9న కన్నుమూశారు.

డాక్టర్ కేఎల్ రావు (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత డాక్టర్ కానూరి లక్ష్మణరావు 1902 జూలై 15న కృష్ణా జిల్లా విజయవాడ ప్రాంతం కంకిపాడు గ్రామంలో జన్మించారు. ప్రముఖ ఇంజనీరు, రాజకీయ నాయకుడు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు సాకారం కావడానికి ఎంతో కృషి చేశారు. విజయవాడ ఎంపీగా 1962 నుంచి 1977 వరకు మూడుసార్లు గెలుపొందారు. నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గాలలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. తొలి నాలుగు పంచవర్ష ప్రణాళికల కాలంలో నాగార్జున సాగర్, మాలంపూయ, కోసి, హీరాకుడ్, చంబల్, ఫరక్కా, శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఆయన స్మృత్యర్థం పులిచింతల ప్రాజెక్టుకు కేఎల్ రావు ప్రాజెక్టుగా నామకరణం చేశారు. మూడుసార్లు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. 1986 మే 18న కన్నుమూశారు.

రాజం అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు 'పద్మభూషణ్' గ్రహీత రాజం అయ్యర్ 1922 జూలై 15న తమిళనాడు రాష్ట్రం కారైకుడిలో జన్మించారు. 20వ యేట తిరువాయూరులోని త్యాగరాజ ఆరాధన ఉత్సవంలో తొలిసంగీత కచేరీ ప్రదర్శించారు. ఆలిండియా రేడియలో టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా కొనసాగారు. ట్రావెన్‌కోర్ రాజవంశీయుల కుటుంబీకులకు సంగీతం నేర్పారు. తిరుప్పావై 30 పాశురాలకు స్వరకల్పన చేశారు. కళైమామణి, సంగీత కళా శిఖామణి, సంగీత ఆచార్య గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2009 మే 9న కన్నుమూశారు.

సిండికేట్ అభ్యర్థుల గెలుపు

పావగడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఎస్‌కే సంఘానికి ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల్లో 15మంది సభ్యుల్లో 14మంది సిండికేట్, ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. అనీల్‌కుమార్ అత్యధికంగా 113ఓట్లతో గెలుపొందగా నాగేంద్రబాబు 18ఓట్లతో అతితక్కువ ఓట్లు సాధించినట్లు అధికారులు తెలిపారు. అనీల్ కుమార్ జీఎస్‌కి 113, అనీల్‌కుమార్ జిసి 106, వెంకటరమణప్ప 106, శ్రీనివాస్ కెవి 104, వెంకట్రాంరెడ్డి 103, అశ్వత్‌కుమార్ 100, రఘునందన్ 96, మను94, వైఎర్ మోహన్ 94, సుబ్బనరసింహ 89, అనందరావు 86, రాజగోపాల్ 80, కృష్ణకుమార్75, విజయ్‌కుమార్ 75, డా. చక్కెరరెడ్డికి 73 ఓట్లు లభించాయని అధికారి తెలిపారు.

కేంద్ర బృందం పరిశీలన

రొద్దం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సానిపల్లిలో కేంద్ర బృందం సభ్యుడు రామాంజనేయులు పరిశీలించారు. సోమవారం సానిపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్-2 కింద సెంట్రల్ టీమ్‌సభ్యులు పాఠశాల ఆవరణం, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, శుద్ధ జలకేంద్రం, చెత్తసంపదకేంద్రం తదితర వాటిని పరిశీలించారు. జిల్లా కోఆర్డినేటర్ సాయినాథ్‌బాబు, ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి బాబు, సర్పంచ్ పరమేశ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

» త్వరలో మంత్రితో భేటీ అవుతాం : డీసీసీబీ డైరెక్టర్ నాగరాజు



మీడియాతో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ డాల్ఫిన్ నాగరాజ్ తదితరులు

శిడ్లఘట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికోసం కాంగ్రెస్ నాయకులు అంతా కలసికట్టుగా కొనసాగుతామని డీసీసీ బ్యాంకు డైరెక్టర్ డాల్ఫిన్ నాగరాజ్ తెలిపారు. బ్యాంకు నుంచి వేలాదిమంది రైతులు, మహిళలకు వందలకోట్ల రూపాయలు రుణం ఇస్తున్నామని, అయితే పాలకవర్గం లేకపోవడంతో రైతులు, మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారని మంత్రి వ్యాఖ్యానించడంతో సమస్యగా మారిందని విచారం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు లేకపోవడంతో పాలకవర్గం లేదని ఈ కారణంగానే రైతులు, మహిళా స్వయంసహాయసంఘాలకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లా రైతులు, మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. డీసీసీ బ్యాంకు పరిస్థితికి తానే కారణమంటూ మంత్రులు డాక్టర్ ఎంసీ సుధాకర్, బైరతి సురేశ్ ఆరోపించారన్నారు. అయితే బ్యాంకు పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించి కోర్టులో మూడు కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుత స్థితిపై మంత్రి సుధాకర్‌ను భేటీ అవుతామన్నారు. ఆయన విదేశీ పర్యటన నుంచి వచ్చాక కాంగ్రెస్ నాయకులంతా కలసికట్టుగా కలుస్తామన్నారు. డీసీసీ బ్యాంకు అధికారులతోనూ సమావేశం నిర్వహించి రైతులు, మహిళాసంఘాల సభ్యులకు రుణాలు ఇవ్వాలని కోరుతామన్నారు. కాగా కాంగ్రెస్‌లో ఎటువంటి వర్గాలు లేవని, చిన్నా చితకా అభిప్రాయబేధాలు ఉన్నప్పటికీ అవి త్వరలోనే సర్దుబాటు అవుతాయన్నారు. ఈ సందర్భంగా హాప్‌కామ్స్ డైరెక్టర్ ముతూరు చంద్రేగౌడ, కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ రామయ్య, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు మేలూరు మురళి, శీగేహళ్ళి బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పెరిగిన ప్రాముఖ్యత



కుట్టుమిషన్ల పంపిణీ

విజయపుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలక్రమంలో ప్రపంచంలో మహిళల ప్రాముఖ్యత పెరిగిందని నారీ శక్తి నారాయణిశక్తిగా మారిందని జేసీఐ అల్యూమిని క్లబ్ జాతీయ అధ్యక్షురాలు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కు చెందిన అంజిగుప్తభాత్ర అభిప్రాయపడ్డారు. స్థానిక బీడిగానహళ్ళి గ్రామంలోని అంజనేయస్వామి ఆలయ ఆవరణలో విజయపుర జేసీఐ అల్యూమిని క్లబ్ ఆధ్వర్యంలో స్వసహాయ సంఘాల మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా మహిళలు ఇతరులకు చప్పట్లు చరుస్తూ వచ్చారని, ప్రస్తుతం మహిళల సాధనకు కూడా ప్రశంసలు అందుతున్నాయన్నారు. ప్రపంచంలో మన ఆలోచనలు మారాల్సి ఉందన్నారు. కుటుంబంలోని పిల్లలకు ఉత్తమ విద్య అందించడం ద్వారా ప్రపంచాన్ని జయించవచ్చునన్నారు. 40ఏళ్ల చరిత్ర కల్గిన విజయపుర జేసీఐ సంస్థ అధ్యక్షురాలుగా శీలా బైరేగౌడ వ్యవహరించడం అభినందనీయమన్నారు. అల్యూమిని క్లబ్ అధ్యక్షుడు దిన్నూరు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాల ప్రజలకు కూడా అందాల్సి ఉందన్నారు. సంఘం సీనియర్ నరేశ్ నాయక్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షురాలు అంజలిగుప్త ఒక నెలరోజులు దేశవ్యాప్తంగా అన్ని క్లబ్‌లను పర్యటిస్తున్నారని, తమవంతు సేవ అందిస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థ చంద్రకళ మాట్లాడుతూ అందరి సహకారంతో మహిళలకు బ్యూటీపార్లర్, పాడి పెంపకం, అగర్బత్తీ తయారీ, టైలరింగ్ వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వారు సిద్ధంచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తున్నామని ఆసక్తిగలవారు తమ ఎన్జీఓను సంప్రదించాలన్నారు. ఇదే సందర్భంగా ఒక నెలలో 57మంది సభ్యులను చేర్పించిన అధ్యక్షులు దిన్నూరు వెంకటేశ్, దేవనహళ్ళి లోకేశ్‌లకు పారితోషికాలతో గౌరవించారు. ఆరుగురికి కుట్టుమిషన్లను అందచేశారు. చన్నరాయపట్టణ గ్రామపంచాయతీ సభ్యుడు మంజునాథ్, మాజీ సభ్యుడు గోపాలరెడ్డి, మాజీ చైర్మన్ మునికృష్ణప్ప, జేసీఐ సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి: స్వామీజీ



విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మహదేవపుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని, వారిలోని ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని హలసూరు రామకృష్ణమఠం స్వామిబోధ స్వరూపానంద అభిప్రాయపడ్డారు. హూడి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు రామకృష్ణమఠం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను మాజీ మంత్రి అరవింద లింబావళి నేతృత్వంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామిబోధ స్వరూపానంద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఉన్నతహోదాలలో ఉన్నారని గుర్తు చేస్తూ అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అలాగే చక్కటి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కొద్దిసేపు ధ్యానం, యోగా వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. బీజేపీ నాయకుడు పవన్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు విజయ్‌గౌడ, జయదేవర్‌రాజు, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

దొడ్డబళ్ళాపుర, జూలై 14(ఆంధ్రజ్యోతి): తాలూకా ఛలవాది మహాసభ ఆధ్వర్యంలో కన్నడ జాగృతభవనంలో సామాజిక వర్గానికి చెందిన పదో తరగతి, ద్వితీయ పీయూసీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు సోమవారం ప్రదానం చేశారు. సుబ్బు హొలెయర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల విద్యార్థుల ఉన్నతవిద్యకోసం ప్రోత్సహించేలా సంఘం చేయూత ఇస్తోందన్నారు. సుమారు 60మందికి ప్రోత్సాహకాలు అందచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ దేవరాజ్, రాష్ట్ర చలవాది మహాసభ అధ్యక్షురాలు వాణి కే శివరామ్, తాలూకా అధ్యక్షుడు గురురాజప్ప తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలతో విద్యార్థులు

అభినయ సరస్వతికి శ్రద్ధాంజలి

విజయపుర, జూలై 14(ఆంధ్రజ్యోతి): అభినయ సరస్వతి సరోజాదేవి అకస్మిక మృతి పట్ల జిల్లా శరణసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణ సమీపంలోని అంకతట్టిగేట్ సమీపాన గల కుంబిగల్ కుటీరంలో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా శరణ సాహిత్య పరిషత్ సహకార్యదర్శి రేణుకా చంద్రశేఖర్ హడపద్ మాట్లాడుతూ ఆమెను కన్నడలో అభినయ సరస్వతిగా, తమిళంలో కన్నడద గిళిగా పేరొందారన్నారు. సినీరంగ చరిత్రలో కన్నడ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విజయవంతమైన నటి అన్నారు. శ్రద్ధాంజలి కార్యక్రమంలో భక్తరహళ్ళి పంచాయతీ మాజీ సభ్యులు భానుమతి జయరాం, లక్ష్మీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ సభ్యులు

రామయ్య వర్సిటీలో తరగతులు ప్రారంభం



వేదికపై ప్రముఖులు

బెంగళూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రామయ్య అప్లైడ్ యూనివర్సిటీలో 2025 దీక్షారంభ్ పేరిట సోమవారం తరగతులను ప్రారంభించారు. జ్ఞానగంగోత్రి క్యాంపస్‌లోని ద్వారక ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించారు. 2025-26 విద్యాసంవత్సరం కొత్త బ్యాచ్ విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించారు. అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ ఆర్‌వీ రంగనాథ్ స్వాగత ప్రసంగం చేశారు. ముఖ్య అతిథిగా ఐబీఎం గ్లోబల్ టాలెంట్ అక్విషన్ లీడర్‌గా ఉన్న అరవింద్ ఏ బెళగుబ పాల్గొని మాట్లాడుతూ ప్రతిభ ఉంటే అవకాశాలకు హద్దులు లేవన్నారు. కావున పాఠాలతోపాటు నైపుణ్యం పెంచుకుని రాణించాలని సూచించారు. విద్యార్థులను చక్కగా ప్రోత్సహించాలని ఇందుకు తల్లిదండ్రులు చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ అశోక్‌రావ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఏజీ ప్రతాప్, ఉపకులపతి కుల్‌దీప్‌రైనా తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల ఇళ్లలో సోదాలు

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఉదయం సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లలో పోలీస్ బృందాలు సోదాలు నిర్వహించాయి. పెనుకొండ, రొద్దం, కియ, సోమందేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. పది ఇళ్లలో సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు. అసాంఘిక కార్యకలాపాల ప్రేరేపితులు బాధితులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు.



అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

- ఇన్‌చార్జిలతో రెవెన్యూ పాలన
- కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

సోమందేపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలు, రైతులకు నిరీక్షణ తప్పడంలేదు. చిన్న చిన్న సమస్యలు సైతం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు వాపోయారు వాపోతున్నారు. రెగ్యులర్ అధికారులు లేక, ఇన్‌చార్జి అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో తిప్పలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ తహసీల్దార్ లేక ఏడాదైనా ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదన్నారు. ఇక్కడ గోరంట్ల తహసీల్దార్ మారుతి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్నారు. ఈయన లేనప్పుడు డీటీ రెడ్డిశేఖర్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నారు. అయితే మండలంలో అనేకమంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎం ద్వారా రీసర్వేకు సంబంధించి కార్యాలయానికి వస్తుంటారు. ఇటీవల తల్లికి వందనం పథకంలో భాగంగా 241మంది అర్హులు భూమి ఎక్కువ చూపడంతో అనర్హులుగా మారి పథకానికి దూరమయ్యారు. అలాగే మండలంలో చేపట్టిన జాతీయరహదారి, రైల్వే ప్రాజెక్ట్ పనుల కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి ఏళ్లు గడిచినా పరిహారం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది ఎప్పుడుంటారో ఎప్పుడుండరో తెలియక కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కదిరేపల్లి సర్వేనంబరు 251లో 30 ఎకరాలు, 249లో 15ఎకరాలు పైచిలుకు జాయింట్ ఎల్‌పీఎంలో రైతుల భూములుండగా పలువురు రైతులు కార్యాలయానికి వచ్చి సోమవారం పడిగాపులు కాశారు. అలాగే హైవే భూసేకరణలో భాగంగా గతంలో వెలిదడకల గ్రామంలో 16.70ఎకరాలు, తుంగోడులో 9.59ఎకరాలు సేకరించారు. ఇందులో తుంగోడు గ్రామంలో 4.90ఎకరాలు, వెలిదడకల 1.25ఎకరాలు పరిహారం అందాల్సి ఉండగా సోమవారం దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైంది. అవసరమైన నకళ్లను రైతులనుంచి సేకరించి నివేదిక పంపుతున్నట్లు వీఆర్‌ఓ లోకేష్ తెలిపారు. అంతేకాక అటెస్టేషన్, భూవివాదం, 1బి, అడంగళ్ తదితర వాటిపై సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ల్యాండ్ ఎల్‌పీఎల్ భూముల వివరాలు నమోదు చేస్తున్న రైతులు

వైభవంగా కుంభాభిషేకం



అలంకరణలో స్వామివారు

మడకశిర టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వరుణుడి కరుణ కోసం సోమవారం పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సహస్రఘటిక కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ కమిటీ సభ్యులు, రైతుల ఆధ్వర్యంలో వేద పండితులు కుంభాభిషేకంతో పాటు వరుణయాగం, రుద్రాభిషేకం, పర్జన్య జపం, శత రుద్రాభిషేకంచ విరాటపర్వ పారాయణం, రుద్ర హోమాలు తదితర పూజలు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వరుణదేవుడు కరుణించకపోవడంతో వర్షాలు కురువాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేకంగా పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు, భక్తులు పాల్గొన్నారు.

కర్ణాటక బ్యాంకు

ఎండీ, సీఈఓగా రాఘవేంద్ర భట్



రాఘవేంద్రభట్

బెంగళూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా రాఘవేంద్ర శ్రీనివాసభట్‌ను సోమవారం బ్యాంకు నియమించింది. ఈనెల 16నుంచి రాఘవేంద్రభట్ అధికార వ్యవధి ప్రారంభం కానుంది. మూడు నెలల వరకు రాఘవేంద్రభట్ ఎండీ, సీఈఓగా కొనసాగుతారని షేర్ మార్కెట్‌కు బ్యాంకు సమాచారం ఇచ్చింది. కర్ణాటక బ్యాంకు ప్రస్తుత ఎండీ సీఈఓ శ్రీకృష్ణ హరిహరశర్మ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానానికి రాఘవేంద్రభట్‌ను నియమించారు. శర్మ ముంబైకు వెళ్లేందుకు నిరాకరిస్తూ, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. ఇదే సమయంలోనే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేఖర్‌రావు మంగళూరుకు బదిలీపై వెళ్లేందుకు రాజీనామా చేసిన విషయం విదితమే. కాగా రాఘవేంద్రభట్ 1981లో అసిస్టెంట్‌గా బ్యాంకులో వృత్తిని ప్రారంభించారు. జూలై 2న సీఓఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రస్తుతం ఎండీ సీఈఓగా నియమింపబడ్డారు.

దిగ్విజయంగా శక్తి పథకం



అగరలో డ్రైవర్, కండక్టర్లకు సన్మానం

బొమ్మనహళ్ళి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన సందర్భంగా ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 500కోట్లమంది ప్రయాణించారని గ్యారెంటీ పథకాల అమలు కమిటీ బొమ్మనహళ్ళి అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి అభిప్రాయపడ్డారు. గ్యారెంటీ పథకాలు పూర్తికాలం కొనసాగుతాయన్న ధీమాను వ్యక్తం చేశారు. మంత్రి రామలింగారెడ్డి సూచన మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం స్థానిక అగరలో బీఎంటీసీ, కేఎస్‌ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌లను సత్కరించారు. పది బస్సులలోని మహిళా ప్రయాణీకులకు మిఠాయిలు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పలు పుణ్యక్షేత్రాలను సులభంగా దర్శించుకోగలిగామన్నారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బన్నేరుఘట్ట రోడ్డు, కోరమంగల, మడివాళ తదితర ప్రాంతాలో డ్రైవర్, కండక్టర్‌లను సత్కరించారు. 500 కోట్ల మైలురాయి సందర్భంగా బస్సులను అలంకరించారు.

నాటకరంగ కళాకారులకు సత్కారం



ఎమ్మెల్యే శివణ్ణకు సన్మానం

దొమ్మసంద్ర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ పట్టణం శ్రీరామకుటీరంలో రేణుకారాధ్య కళాకారుల బృందం, ఆనేకల్ చంద్రసేవా ట్రస్టు ఆధ్వర్యంలో నాటక రంగ కళాకారులు 30మందికిపైగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీ శివణ్ణ మాట్లాడుతూ ఇటీవలిరోజుల్లో నాటకరంగ కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవం అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. నగరీకరణ, టీవీ, మొబైల్ వాడకం పెరిగాక నాటకరంగ కళాకారుల ప్రాధాన్యత తగ్గిందన్నారు. ఇదివరకు పౌరాణిక కళాకారులు నిర్వహించే నాటకాలతో ప్రజాచైతన్య కార్యక్రమాలు కొనసాగేవన్నారు. ఇప్పటికీ మహాభారతం, ఇతర పురాణాల ఆధారంగా అక్కడక్కడా పౌరాణిక ప్రదర్శనలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గుమ్మళాపుర సంస్థానమఠం శివానంద శివాచార్యస్వామి, పురసభ అధ్యక్షురాలు సుధా నిరంజన్, కళాకారులసంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కరవే అధ్యక్షురాలి మృతి

పావగడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రక్షణ వేదిక మహిళా విభాగం, రైతు సంఘం మహిళా నాయకురాలు అన్నపూర్ణ(55) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. మహిళా నాయకురాలుగా తుంగభద్ర నీటి కోసం బెంగళూరు వరకు పాదయాత్రలో కీలకపాత్ర పోషించిన అన్నపూర్ణమ్మ ఎన్నో పోరాటాలు చేశారు. ఆమె మృతిపట్ల తాలూకా రైతు సంఘం, కర్ణాటక రక్షణ వేదిక, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

హిందీ టీచర్‌ను నియమించండి

హిందూపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తూమకుంట పారిశ్రామికవాడలోని పాఠశాలలో హిందీ టీచర్‌ను నియమించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి వినతిపత్రాన్ని అందించారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 50మంది విద్యార్థులున్నారని, వారు వలస వచ్చిన కార్మికుల పిల్లలన్నారు. వీరికి హిందీలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులను నియమించకపోతే వారు బడిబయట పిల్లలుగా మారిపోతారన్నారు. నాయకులు నాగేంద్ర, అనుదీప్, మహేష్, నజీర్, లిఖిత్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

అమరాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో సోమవారం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ లక్ష్మీనరసింహ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.32	1,606.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	42,844	18.060
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	35,300	210
నీటి నిల్వ (టీఎంసీలు)	77.54	30.69

ఏపీఎంసీ సెక్రటరీగా జయకుమార్



బళ్లారి గాంధీనగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి(ఏపీఎంసీ) నూతన సెక్రటరీగా ఆర్.జయకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇక్కడ సెక్రటరీగా పనిచేసిన నంజుండ స్వామి మే నెలలో రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో కొత్తగా జయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లో బళ్లారి ఒకటన్నారు. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులతో పాటు కూరగాయలు, పండ్ల మార్కెట్ ఉండడంతో నిర్వహణ రోజూ అధిక ప్రమాణంలో వ్యర్థపదార్థాలు ఉత్పత్తి అవుతుంటాయని, వాటి రోజువారి తరలింపు కొంత కష్టమే అయినా మార్కెట్‌ను శుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తానానని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌కు అన్‌సీజన్ కావడంతో పెద్దగా వ్యవసాయ ఉత్పత్తులు తక్కువగా వస్తుంటాయని, అమ్మకాలు, కొనుగోళ్ళు అంతంత మాత్రమే మార్కెట్‌కు పెద్దగా ఆదాయం ఉండదన్నారు. నవంబరు, డిసెంబరు వరకు మార్కెట్ లావాదేవీలు తక్కువగా ఉంటాయని, ఆశించిన మేర వ్యాపారస్తుల నుండి మార్కెట్ సెస్ కల్యెక్షన్ ఉంటుందన్నారు. ఇదే మార్కెట్‌లో కూరగాయలు, పండ్ల మార్కెట్ ఉండడంతో ఉదయం వేళ మార్కెట్ హడావుడిగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో సమస్యలు సర్వసాధారణ ఉంటాయని, వ్యాపారస్తులు ఏపీఎంసి సమితి అధికారుల సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి నెలలో ఉప లోకాయుక్త అధికారులు సందర్శించిన సమయంలో మార్క్యెట్‌లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు, ఒక్కొక్కటి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. స్థలాల కేటాయింపులో గతంలో జరిగిన సమస్యలు తన దృష్టికి వచ్చినట్లు, వాటిని కూడా పర్యిష్కరిస్తానన్నారు. లీవ్ అండ్ లైసెన్స్ ముగిసి 10 సంవత్సరాల తరువాత శాశ్వతంగా స్థలాలు పొందిన వారు సొంత కట్టడాలు నిర్మించ్యూకుని కేవలం ఏపీఎంసి పరిధిలోకి వచ్చే రైతుకు ఉపయోగపడే వ్యాపారాలు చేయాలని, కేటాయించిన దుకాణాలను ఇతరులకు అద్దెకు ఇవ్వరాదని, అలా అయితే సమితి అనుమతి తీసుకుని ఏపీఎంసీ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి ఉంటుందని సూచించారు. ఏపీఎంసీ ప్రాంగణంలో స్థలాలు పొందిన వారు వ్యాపారం నిమిత్తం బ్యాంకుల్లో అప్పులు తీసుకుని, కట్టలేక బ్యాంకులు వేలం వేసి ఇతరులకు ఆ స్థలాలు గాని, దుకాణాలు గాని ఏపీఎంసి పాలక మండలి అనుమతి లేకుండా వ్యవహారాలు చేయరాదని, బ్యాంకులు వారు కూడా వ్యాపారస్తులకు రుణాలు మంజూరు చేసే సమయంలో ఏపీఎంసి దృష్టికి తీసుకురావాలన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు లక్ష్మీదేవి ఎంపిక



హొస్పేట, జూలై14(ఆంధ్రజ్యోతి): మరియమ్మనహళ్లి హోబ్లిలోని దన్ననాయకనకెర గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కర్ణాటక రాష్ట్ర రచయితల సంఘం (ఆర్ ఎ్స డ బ్ల్యూఏ) అందజేసే కన్నడ కోగిలే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. కర్ణాటక రాష్ట్ర రచయితలసంఘం 'కర్ణాటక ధ్వనీ' వేదిక ద్వారా సోషల్ మీడియాలో పాటల పోటిని నిర్వహించింది. ఇందులో వందలాది మంది గాయకులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు పాడిన పాటలను విని సమీక్షించి ఉత్తమ గాయకులను విజేతలుగా ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఈనెల 27న చిక్కమంగళూరులోని కన్నడ భవన్‌లో అవార్డు అందజేయనున్నారు.

ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేస్తున్నాం

● సీఎం హామీ ఇచ్చినా అమలు చేయరా..? ● డిమాండ్ల సాధన కోసం ఆశా కార్యకర్తల భారీ నిరసన



కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఆశా కార్యకర్తలు

బళ్లారి సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేస్తున్నాం ఉన్నఫళంగా ఇంటికి పంపుతారా అంటూ ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధన కోసం ఆశా కార్యకర్తలు సోమవారం నిరసన చేపట్టారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు వేతనం చెల్లించాలని ఏఐయూటీయూసీ అనుబంధ కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ కోరింది. బళ్లారి జిల్లా కమిటీ రాజ్‌కుమార్ పార్క్ నుంచి జిల్లాకలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగలక్ష్మీ మాట్లాడుతూ జనవరిలో జరిగిన నిరవధిక సమ్మె సమయంలో ముఖ్యమంత్రి ఆశా కార్యకర్తలకు రూ.10వేలు వేతనం ఇస్తామని, ఏప్రిల్ నుంచే దీనిని అమలు చేస్తామని ప్రకటించారన్నారు. కానీ ఇంతవరకు ఈవిషయంలో ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ముఖ్యమంత్రి తన మాటను నిలబెట్టుకోలేదన్నారు. అంతేకాకుండా ఆశా కార్యకర్తలను హేతుబద్ధీకరించడం పేరుతో నిర్దిష్ట సంఖ్యలో ఆశా కార్యకర్తలు ఇంటికి పంపే ప్రయత్నం జరుగుతోందన్నారు. గత 10-15 సంవత్సరాలుగా గర్భిణీలు, శిశువుల ఆరోగ్యం కోసం, సమాజ ఆరోగ్యం కోసం పగలు, రాత్రి పనిచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొవిడ్ కాలంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కష్టపడి పనిచేసిన ఆశా కార్యకర్తలను ప్రభుత్వం ఎటువంటి దయ లేకుండా ఇంటికి పంపించడం దారుణమన్నారు. ప్రభుత్వం , ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున గళమెత్తాలని, రాబోయే రోజుల్లో మళ్ళీ తీవ్ర పోరాటానికి సిద్ధం కావాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతిపత్రం పంపారు. ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ ఆశా కార్మికులు తమ ఐక్యతను కాపాడుకోవాలన్నారు. ఏ ఆశా కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడాన్ని సహించేది లేదని, పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా తాలూకా నాయకులు రేష్మ, రామక్క, సహన, ఈరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారవాణా బస్సులో 500 కోట్ల మంది ప్రయాణం

● రాష్ట్రవ్యాప్తంగా 'శక్తి' విజయోత్సవాలు ● మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్సే: ఎమ్మెల్యే గవియప్ప



మహిళలకు స్వీట్లు తినిపిస్తున్న ఎస్పీ శోభారాణి



హొస్పేటలో బస్సు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప

బళ్లారి రూరల్/కంప్లి/రాయచూరు/సిరుగుప్ప, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు గ్యారెంటీ పథకాల్లో ఒకటైన శక్తి యోజన పథకంలో సోమవారం నాటికి 500 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. పంచాయతీ పథకం అమలు కమిటీ ఆధ్వర్యంలో బళ్లారి కొత్త బస్టాండ్ సమీపంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా మహనగర పాలిక మేయర్ నందీష్, ఎస్పీ డాక్టర్ శోభారాణి, లిక్కర్ అధ్యక్షుడు మొండ్రిగి నాగరాజు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ గ్యారెంటీ యోజన చిదానందప్ప, గ్యారెంటీ ఉపాధ్యక్షుడు సంఘం విజయ్ కుమార్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. రెండు సంవత్సరాల కింద మహిళా శక్తి యోజన 500 కోట్ల మంది మహిళలు, ప్రజా రవాణా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి పురస్కరించుకుని ఐదు గ్యారెంటీ పథకం అమలు కార్యక్రమం నిర్వహించారు.

● :శక్తి యోజన కింద 500కోట్ల మంది మహిళల కలలను ప్రభుత్వ రవాణా బస్సుల్లో ఉచితంగా సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి సిద్దరామయ్యకే దక్కుతుందని ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప అన్నారు. హొస్పేట నగరంలోని సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో శక్తి యోజన కింద 500కోట్ల ఉచిత టిక్కెట్ల పంపిణీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు..

● ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గ్యారెంటీ యోజన అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. కంప్లి బస్టాండు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ చంద్రశేఖర్, ఉస్మాన్, రగు, సుధీర్, గోపాలకృష్ణ, మూకయ్యస్వామి, లడ్డా వన్నూర్ వలీ, మస్తాన్, సిద్దప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకం రెండేళ్ల పూర్తయిన నేపథ్యంలో సంబరాలు

● ఐదు వందల కోట్ల మందితో శ్రీశక్తి పథకం విజయవంతంగా కొనసాగుతోందని గ్యారెంటీ పథకాల కమిటీ రాష్ట ఉపాధ్యక్షులు కరిబసప్ప అన్నారు.. సోమవారం సిరుగుప్ప పట్టణం ఆర్టీసీ బస్టాండులో శ్రీశక్తి పథకం రెండేళ్ల పూర్తయిన నేపథ్యంలో బస్సులకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్సుల డిపో మేనేజర్ తిరుమలేష్, గ్యారెంటీ పథకాల సంఘం అధ్యక్షులు మారుతీవరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా తీసకొచ్చిన శక్తి పథక ద్వార మహిళల్లో నిజమైన ఆర్థిక స్వావాలంబన లభించిందని ఐదు గ్యారెంటీల అమలు సమితి జిల్లా అధ్యక్షుడు పామయ్య మురారీ అన్నారు. శక్తి పథకం ద్వార మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల అటు 4 ఆర్టీసీ డివిజన్‌లకు గణనీయమైన ఆదాయంతో పాటు ప్రభుత్వానికి కీర్తి లభించిందన్నారు. 500 కోట్ల మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం అందించిన నేపథ్యంలో సోమవారం నగరంలోని సెంట్రల్ బస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. మహిళలు స్వేచ్ఛగా తమ ఆర్థిక లావాదేవిలను నిర్వహించుకునేందుకు శక్తి పథకం అనుకూలంగా మారిందన్నారు. దీనికి తోడు అనేక మంది మహిళలు స్వతంత్ర్యంగా తమ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు ఆర్థిక రంగానికి మంచి ఊతం లభించిందన్నారు.


తోడేలు దాడిలో 13 గొర్రె పిల్లల మృతి



గొర్రెపిల్లల కళేబరాలు

కంప్లి, జూలై14(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం, సోమలాపురం పరిధిలో సోమవారం గొర్రెపిల్లలపై తోడేలు దాడి చేసింది. దాడిలో పదమూడు జీవాలు మృతి చెందాయి. సోమలాపురం గ్రామానికి చెందిన లింగప్ప గొర్రె పిల్లల కోసం మేతకు వెళ్లిన సమయంలో గొర్రెలపై తోడేలు దాడి చేసి హతమార్చినట్లు తెలిపారు. తీవ్రంగా నష్టపోయానని ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

దమ్మూరు సోమప్పకు అహిందరత్న అవార్డు



సిరుగుప్ప, జూలై 14(ఆంధ్రజ్యోతి) : కురుబ సంఘం అధ్యక్షుడు దమ్మూరు సోమప్పకు అహిందరత్న అవార్డుకు ఎంపికయ్యారు. సిరుగుప్ప తాలుకాలో హైందవ వర్గానికి ఎన్నో యేళ్లనుంచి సేవలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర హైందవ కమిటీ సంఘం ఆయనను హైందవరత్న అవార్డుకు ఎంపిక చేసింది. తాలుకాలోని కురుబ సమాజం అహింద నాయకుడిగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సేవలు చేయడంతో ఆయనను గుర్తించి ఆయనకు అవార్డును అందించినట్లు జిల్లా అహింద అధ్యక్షుడు తెలిపారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె

లోక్ అదాలత్ విజయవంతం

● న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని 31కోర్టుల్లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతం అయ్యిందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయాధికారి , జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కేజీ శాంతి మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు, ప్రభుత్వ అధికారుల సహకారంతో అదాలత్ నిర్వహించామన్నారు. క్రిమినల్ కేసులు, మోటారు వాహన కేసులు, డబ్బు రికవరీ కేసులు, మోటారు ప్రమాద పరిహారం కేసులు, ఉద్యోగి పరిహారం కేసులు, విద్యుత్ చట్టం కేసులు, వాటా విభజన కేసులు, వైవాహిక లేదా కుటుంబకేసులు, సివిల్ కేసులు, రాజీ ద్వారా పరిష్కకరించగల ఇతర కేసులను లోక్ అదాలత్‌లో పరస్పర అంగీకారం ద్వారా పరిష్కరిం చామన్నారు. రాజీమార్గం ద్వారా ఎన్నో కేసులు పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందాలన్నారు.

లోక్ అదాలత్ సంక్షిప్త నివేదిక

ఈనెల 12న జరిగిన లోక్-అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న 16,424 కేసులను ముగించి మొత్తం రూ.34,31,97,228 పరిహారంగా చెల్లించారు. 8,59,362ప్రీ ట్రయిల్ కేసులు మూసివేశారు. వాటిలో రూ. 31,33,76,853 పరిహారంగా బ్యాంకులు ,ప్రభుత్వ విభాగాల ట్రెజరీలో జమ చేయబడింది. కుటుంబ సమస్యల సందర్భాల్ల 11జంటలు సయోధ్య ద్వారా తిరిగి కలిశారు. లోక్ అదాలత్ గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించడంలో సిబ్బంది విశేషంగా కృషి చేశారని న్యాయాధికారి అన్నారు.

సైనిక రక్షణపై విద్యార్థులకు అవగాహన

బళ్లారి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం స్కూలు విద్యార్థులకు ఇన్నర్‌వీల్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో సైనికుల భద్రతపై అవగాహన కల్పించారు. సోమవారం మాజీ సైనికుల ఆధ్వర్యంలో జాతీయ భద్రత పట్ల, దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న వారి కష్టాలు, 24 గంటల పాటు మంచు పర్వతాల్లో పహారా కాస్తున్న వైనాన్ని వారు విద్యార్థులకు వివరించారు. పర్వతాల్లో వర్షం గాలితో కూడిన ఉన్న ప్రదేశాల్లో మనం పొందుతున్న కష్టాల గురించి విద్యార్థులకు మాజీ సైనికుల ఆధ్వర్యంలో పలు విషయాలు తెలిసి మీరు కూడా కష్టపడి చదవాలని మీ తల్లిదండ్రులను మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఉపాధ్యాయులు కూడా మంచి పేరు తీసుకురావాలని కళ్యాణ కర్ణాటక మాజీ సైనిక సంఘం ప్రధాన బీఎస్ ప్రహ్లాదరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భలే బళ్లారి జిల్లా హోంగార్డు మాజీ సైనికులు, షేక్ సాబ్ కర్ణాటక మాజీ మిలిటరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ ప్రహల్లాద రెడ్డి, ఉపాధ్యక్షుడు, ఈశ్వరరెడ్డి, డైరెక్టర్ లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



చికిత్స పొందుతున్న బాలుడు

కంప్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బాలాపురం గ్రామంలో సాయంత్రం వీధి కుక్కల దాడిలో 12 సంవత్సరాల బాలుడు తీవ్ర గాయాలయ్యాయి. సాయంత్రం కరెప్ప పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో రోడ్లపై నిలిచిన కుక్కలు కరెప్ప అనే బాలుడిపై దాడి చేశాయి. అక్కడున్నవారు వెంటనే అరవడంతో వదిలివెళ్లాయి. తల్లిదండ్రులు చికిత్స కోసం కంప్లి రాగా మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి

హొస్పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): హొస్పేట్‌లోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లుగా హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దొడ్డ ఈరన్న ఏఎస్ఐగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ఈరన్న హెడ్‌కానిస్టేబుల్‌గా 7సంవత్సరాలు వివిధప్రాంతాల్లో పనిచేశారు. ఆదివారం హొస్పేట్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. తన సేవా కాలంలో చేసిన సేవలకు మూడు అవార్డులు అందుకున్నారు. ఎస్పీ పోలీస్ బీఎల్ శ్రీహరిబాబు మార్గదర్శకత్వంలో ఆయన దొడ్డ ఈరన్న పోలీస్ స్టేషన్‌లోని సీపీఐ లఖన్ నుంచి ఏఎస్ఐ బాధ్యతను స్వీకరించారు.

20న సీపీఎం నిరసన

హొస్పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 300మందికి పైగా మహిళలకు సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రియాంక జైన్ మోసం కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ ఈనెల 20న నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఎం తాలూకా కార్యదర్శి యల్లలింగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రియాంక మహిళా పట్టిన సహకారి సంఘ లిమిటెడ్ హొస్పేట్ పేరుతో ప్రియాంక జైన్, ఆమె బృందం చేసిన కోట్లాది రూపాయల మోసం కేసును సమగ్ర దర్యాప్త కోసం సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాము. జిల్లాలో 300 మందికి పైగా మహిళలకు కేంద్రప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. మోసగాళ్లలో కొందరు చాలా ప్రభావవంతులైన వారు, చాలా సంవత్సరాలుగా కాంగ్రెస్, బీజేపీతో సంబంధాలు కలిగి ఉన్నారు. రాష్ట్ర స్థాయి ఆఫీస్ బేరర్లుగా కూడా ఉన్నారు. సబ్సిడీ రుణాలు అందిస్తామని తప్పుడు ప్రకటనలు చేసి అమాయక ప్రజలను మోసం చేయడానికి ఇటువంటి పదవులను ఉపయోగించుకున్నారన్నారు. 20న ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప ఇంటి దగ్గర నిరసన చేపడ్తామన్నారు.

ప్రతి వార్డులో యోగా కేంద్రం

అందరికీ శిక్షణ : చైతన్య వేదిక అధ్యక్షురాలు జ్యోతి ప్రకాశ్



గురువందన కార్యక్రమంలో మహిళలు

బళ్లారి సిటీ,జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతి వార్డులో ఒక యోగా కేంద్రం ఏర్పాటు చేయాలని కన్నడ చైతన్య వేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి ప్రకాశ్ అన్నారు. జిల్లా పతంజలి యోగా కమిటీ ఆధ్వర్యంలో కన్నడ చైతన్య వేదిక సహకారంతో నగరంలోని వుంకి మరిసిద్ధమ్మ పాఠశాల ప్రాంగణంలో బసవేశ్వర యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగా ఉపాధ్యాలకు ఆదివారం గురువందన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అధ్యాత్మిక గురువులు చీకటి నుంచి వెలుగు తెస్తారని, జ్ఞానాన్ని అందిస్తారన్నారు. కార్పోరేషన్ సభ్యురాలు సురేఖ మల్లనగౌడ మాట్లాడుతూ యోగా సమాజాన్ని వ్యాధి రహితంగా మారుస్తుందని, గురువుల అధ్యాత్మిక బోధనల ద్వారా సహనం , జ్ఞానం ప్రకాశిస్తుందన్నారు. ఆయుష్ జిల్లాకమిషనర్ విరూపాక్షప్ప మాట్లాడుతూ ఆయుర్వేదం, యోగా ఒక నాణేనికి రెండు వైపులా ఉన్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పతంజలి జిల్లా అధ్యక్షుడు పొంపనగౌడ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి వార్డులో ఒక యోగా కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కర్ణాటకాలో అత్యధిక శిబిరాలను నిర్వహించడంలో పతంజలి కమిటీ ముందంజలో ఉందన్నారు. కల్యాణ స్వామి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవితంలో ఆహారం మారిందని, వివిధ వ్యాధులు ప్రబలంగా ఉన్నాయన్నారు. ఈసందర్భంగా వుంకి మరిసిద్దమ్మ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మంజుల, కన్నడ చైతన్యవేదిక అధ్యక్షుడు ప్రభుకుమార్, గౌరవ అధ్యక్షుడు విరూపాక్షప్ప, సంతోష్ మెహ్రా,ఎస్పీ పురాణిక్, రుద్రప్ప, పెద్దబసప్ప, కృష్ణమూర్తి, రఘురామశెట్టి తదితరులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

లారీని ఢీకొన్న బైకు.. ముగ్గురు విద్యార్థుల మృతి



మృత్యువాత పడ్డ విద్యార్థులు(ఫైల్)

హొసూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలో ఆగిఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మిదిగిరిపల్లి నివాసి పూజారి కుమారుడు, తొమ్మిదో తరగతి విద్యార్థి మదన్ (14), బీరేంద్ర సింగ్ కుమారుడు, ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్యన్‌సింగ్ (13), అందివాడి పాఠశాల 9వ తరగతి విద్యార్థి హరీష్ (14) మృతి చెందారు. ఆదివారం తండ్రి ద్విచక్రవాహనంపై మదన్ పాఠశాలకు వచ్చాడు. ఆర్యన్‌సింగ్‌తో కలసి అందివాడికి వెళ్లాడు. అక్కడ హరీశ్‌తో కలసి వస్తుండగా ఆగియున్న లారీని వెనుకనుంచి ఢీ కొన్నారు. ఘటనాస్థలంలో ఆర్యన్‌సింగ్ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న మధుగిరి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై, అదనపు ఎస్పీ శంకర్, హొసూరు ఏఎస్పీ అనిల్ అక్షయ్ వాఘరే పరిశీలించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేష్ జంగంశెట్టి

బళ్లారి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రావు బహదూర్ మహబలేశ్వరప్ప టెక్నికల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ వేడుకలను శనివారం రాత్రి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ సురేష్ జంగం శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ సాంకేతిక విద్య ప్రాముఖ్యత శాశ్వతం, మార్పును అంగీకరించే వైఖరిని తెలిపారు. సహకారం నీతి, నిజాయితీతో జీవితంలో పురోగతి సాధించవచ్చన్నారు. కావేరిలోని హావేరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్లు సురేష్ జంగం శెట్టి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణ స్వామి, ఆర్‌వైఎంసీ సంఘం అధ్యక్షుడు జానేకుంట బసవరాజు, ప్రిన్సిపాల్ టి హనుమంతరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సవిత సోనాలి, డాక్టర్ ప్రభావతి, కన్వీనర్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ గోపీనాథ్

ఫ్లై ఓవర్ మరమ్మతుకు మరింత సమయం: ఎంపీ

హొసూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హొసూరులో ఫ్లై ఓవర్ మరమ్మతు పనులకు 22 రోజుల సమయం పడుతుందని కృష్ణగిరి ఎంపీ కే గోపీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్లై ఓవర్ పగుళ్లు ఏర్పడి మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ రద్దీ నెలకొందని, ప్రజలు సహకరించాలన్నారు. ఫ్లై ఓవర్ పిల్లర్‌పై కుండ ఆకారపు ప్రత్యేక స్ప్రింగ్ దెబ్బతిందని, 4 స్ప్రింగ్‌లను తయారు చేయడానికి పనులు జరుగుతున్నాయన్నారు. కాగా రాయకోట్టై, కెలమంగలం రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల కోసం రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు చిన్నకుట్టప్ప సహా ఆదివారం పరిశీలించామన్నారు. తళి రైల్వే ఫ్లై ఓవర్‌పై నిర్మాణాల జాప్యం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నీలకందన్, సాదిక్‌ఖాన్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అక్బర్, నిర్వాహకులు రఘుమైజా అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బెట్టదమ్మదేవి ఆలయ కుంభాభిషేకం



అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హొసూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): 1200 ఏళ్ల చరిత్ర కల్గిన బెట్టదమ్మదేవి ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయంలో చంద్రచూడేశ్వరుడు, పెట్టతమ్మ, చిన్నమ్మదేవతలు ఉన్నారు. శనివారం గణపతి హోమంతో పూజలు ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం నిర్వహించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు కొనసాగాయి. బెల్లకొండపల్లి, కలుకొండపల్లి, మాడకొండపల్లి, ఎస్ ముదుకనపల్లి, ఉలి వీరనపల్లి, నాగొండపల్లి పంచాయతీలకు చెందిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన వేణుగోపాల్, హొసూరు కార్పొరేషన్ జోనల్ కమిటీ చైర్మన్ జేపీ ఎంగింర జైప్రకాశ్, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, హొసూరు ఎమ్మెల్యే ప్రకాశ్, తళి ఎమ్మెల్యే రామచంద్రన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.